ప్రజాశక్తి
శుక్రవారం 21 ఏప్రిల్ 2023

పది మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి

## 'పది'లో మెరుగైన ఫలితాలు వస్తాయి..

◆ మేలో ఫలితాలు వచ్చే అవకాశం ◆ ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి

**ప్రజాశక్తి-అనంతపురం సిటీ**

ఈ సారి పదో తరగతిలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం గతం కంటే మెరుగ్గా ఉంటుందని ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. అనంతపురం కెఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పది మూల్యాంకన కేంద్రాన్ని డిఇఒ ఎం.సాయిరామ్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ పది మూల్యాంకనం సజావుగా జరుగుతోందని చెప్పారు. ఉపాధ్యాయులకు కావాల్సిన వసతులు అన్నీ కల్పించామని చెప్పారు. మూల్యాంకనం విధులకు వచ్చిన ఉపాధ్యాయులు అందరూ నిబంధనలకు లోబడి పనిచేయాలన్నారు. ఈసారి పదో తరగతి పరీక్షల ఫలితాలు గ్రేడ్ రూపంలో కాకుండా మార్కుల రూపంలో వస్తాయన్నారు. ఫలితాలు ఎప్పుడు విడుదల చేస్తారన్నది ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. మే నెలలో వచ్చే అవకాశం ఉందన్నారు. వేసవి సెలవుల్లో 98 డీఎస్సీ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిలు ప్రసాద్, గోవిందనాయక్, డిప్యూటీ డీఈవోలు పద్మప్రియ, శంకర పాల్గొన్నారు.

**మెడికల్ క్యాంపు ఏర్పాటు**

ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ ప్రత్యేక చొరవ తీసుకుని మూల్యాంకనం కేంద్రంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయించారు. ఈ మెడికల్ క్యాంప్‌ను డీఈవో పరిశీలించారు. ఏఏ మందుకులు అందుబాటులో ఉంచారన్న విషయాన్ని వైద్య సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు.

# వార్షిక విత్తన ప్రణాళిక సిద్ధం

## మన విత్తనం ఇక లేనట్టేనా .?

**వార్షిక విత్తన ప్రణాళికను ప్రభుత్వం ప్రకటించింది. ఖరీఫ్, రబీ సీజన్లలో ఈ జిల్లాకు ఎంత విత్తనాలు అవసరమన్నది అంచనా వేసింది. ఈ మేరకు ఆయా సీజన్‌లో విత్తన కేటాయింపులను ఖరారు చేసింది. అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో ప్రధానమైన పంట వేరుశనగ. ఈ పంటకు సంబంధించి కూడా రెండు జిల్లాలకు విత్తన కేటాయింపులను ఖరారు చేసింది.**

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

విత్తన కేటాయింపులకు సంబంధించి అనంతపురం జిల్లాకు 78,245 క్వింటాళ్లు కేటాయించగా, సత్యసాయి జిల్లాకు 100907 క్వింటాళ్లు కేటాయించింది. రెండు జిల్లాలకు కలిపి 1,79,152 క్వింటాళ్లు కేటాయించింది. గతేడాది కూడా ఇదే రకమైన కేటాయింపులు జరిగాయి. అయితే ఈ విత్తనకాయలు కూడా తీసుకోవడానికి రైతులు ముందుకు రాకపోవడం గమనార్హం. అయితే ఈ విత్తన సేకరణకు సంబంధించి ఇప్పటి వరకు సేకరణ ధర ఖరారవలేదు. సేకరణ ధర ఖరారు తరువాత సబ్సిడీ ధర ఎంతన్నది తేలే అవకాశముంది. సాధారణంగా జిల్లాలో మే నెలలో ఖరీఫ్ వేరుశనగ విత్తన కాయ్లు పంపిణీ ప్రారంభమవుతుంది. అంతలోపు అంటే ఈ నెలాఖరులోపు విత్తన సేకరణకు సంబంధించిన కసరత్తు పూర్తి చేయాల్సి ఉంటుంది. వేరుశనగతోపాటు వరి 1500 క్వింటాళ్లు, కందులు 4300 క్వింటాళ్లు, ఉలవలు 825 క్వింటాళ్లు, పిల్లిపెసర, అలసందలు, ఇతరములన్నీ కలిపి అనంతపురం జిల్లాకు ఖరీఫ్‌కు 85,322 క్వింటాళ్లు కేటాయించింది. ఇక సత్యసాయి జిల్లాకు వంద క్వింటాళ్ల కందులు, 50 క్వింటాళ్లు రాగి ఇతరములన్నీ కలిపి 1,01,141 క్వింటాళ్లు కేటాయించారు.

**రబీ కేటాయింపులు ఇలా...**

రబీ సీజన్‌కు ఇప్పుడే విత్తన కేటాయింపులు ఖరారు చేశారు. అనంతపురం జిల్లాలో రబీలో 24,700 క్వింటాళ్లు పప్పుశనగ, 200 క్వింటాళ్లు ఉలవలు, 6,799 క్వింటాళ్లు వేరుశనగ, ఇతర పంటలన్నీ కలిపి 31,736 క్వింటాళ్లు రబీకి కేటాయించారు. 500 క్వింటాళ్లు వరి, 1350 క్వింటాళ్లు పప్పుశనగ, 8223 క్వింటాళ్లు వేరుశనగ, మొత్తం 10,083 క్వింటాళ్లు సబ్సిడీ విత్తన కేటాయింపులు రబీకి చేశారు. వీటిని అక్టోబరు మాసం తరువాత పంపిణీ చేస్తారు.

**మన విత్తనం లేనట్టేనా ?**

ప్రభుత్వం సబ్సిడీతో పంపిణీ చేసే వేరుశనగ విత్తనకాయలు బయట వ్యాపారుల నుంచి సేకరిస్తుండటతో నాణ్యమైన విత్తనం అందుబాటులో ఉండటం లేదన్న ఆరోపణలు గతంలో వచ్చాయి. ట్రూత్‌ఫుల్ లేబుల్డ్ సీడ్ విత్తనం పేరుతో సరిగాలేనివి కూడా పంపిణీ చేసినట్టు గతంలో విజిలెన్సు ఇతర శాఖల విచారణలోనూ తేలింది. దీంతో నాణ్యతమైన విత్తనం కనీసం 25 శాతమైనా ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో మన విత్తనం...సొంత విత్తనం పేరుతో రబీలో కొంత మంది రైతులకు విత్తనకాయలను అందజేసి ఖరీఫ్‌లో దాన్ని సేకరించి ఇవ్వాలని నిర్ధేశించడం జరిగింది. ఇందుకు అనుగుణంగా ఎపి సీడ్స్ శాఖకు బాధ్యతలు అప్పగించేవారు. ఆ శాఖ సర్టిఫైడ్ సీడ్‌ను రైతుల ద్వారా పండించి ఖరీఫ్‌లో వారి నుంచి సేకరించి విత్తనకాయలుగా పంపిణీ చేసేవారు. కాని ఈ ఏడాది రబీలో అటువంటి ప్రక్రియ ఏదీ జిల్లాలో జరగలేదు. దీంతో మొత్తం విత్తనకాయలను ప్రయివేటు వ్యాపారుల నుంచే కొనుగోలు చేయాలన్న ఆలోచనలో ఆ శాఖ ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే రైతులు నాణ్యమైన విత్తనం దొరక్క ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రభుత్వం పూర్తిగా సర్టిఫైడ్ సీడ్‌నే సేకరించే పరిస్థితి లేకుండా మొత్తం ట్రూత్‌ఫుల్ లేబుల్డ్ పేరుతో దొరికిన విత్తనాన్ని రైతులకు అంటగట్టే పరిస్థితి ఉంటుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## చలివేంద్రం ఏర్పాటు

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

పుట్టపర్తి తహాశీల్దార్ కార్యాలయం ఎదుట ఆ కార్యాల సిబ్బంది ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్డీవో భాగ్యరేఖ గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తహాశీల్దార్, ఆర్డీవో, కోర్టు, ఎంఇఒ, ఎంపిడిఒ, పోలీసుస్టేషన్‌కు పనుల నిమిత్తమై వచ్చే వారికి ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రద్దీ ఉన్న ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తే మంచిదని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ నవీన్ కుమార్, డిప్యూటీ తహాశీల్దార్ నరసింహులు రూరల్ ఎస్ఐ దాదా పీరా, విఆర్ఒలు పాల్గొన్నారు.

## గడువులోగా పంటరుణాల రెన్యువల్

**ప్రజాశకి - గాండ్లపెంట**

ఖరీఫ్ లో పంట సాగు కోసం బ్యాంకులో రైతులు తీసుకున్న రుణాలు గడుపులోపు రెన్యువల్ చేసుకోవాలనిఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ భరత్ ప్రవీణ్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బ్యాంకు రుణాలు తీసుకున్న రైతులు గడువులోగా రెన్యువల్ చేసుకోవాలన్నారు. మండలంలో దాదాపు 2.975 మంది రైతులు బ్యాంకు రుణాలు పొందారన్నారు. వీరు గడువులోగా రెన్యూవల్ చేసుకుంటే వారికి సున్నా వడ్డీ, ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు వర్తిస్తాయని చెప్పారు.

## సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

### జిల్లా అదనపు న్యాయమూర్తి శైలజ

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయమూర్తి శైలజ

**ప్రజాశక్తి-హిందూపురం**

విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అదనపు జిల్లా జడ్జి శైలజ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కొటిపి రహదారిలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకులంలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు న్యాయమూర్తి శైలజ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సంస్కారాన్ని కూడా నేర్చుకోవాలన్నారు. ముఖ్యంగా గురువులు, తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని అందుకు అనుగుణంగా విద్యాభ్యాసం సాగించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఆ తర్వాత తమకు అవకాశం ఉన్నంత మేరకు సమాజాభివృద్ధికి సహకారం అందించాలన్నారు. బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, హక్కులు, బాధ్యతలు, చట్టాల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపల్ నాగమణి, న్యాయవాదులు కళావతి, నవేరా, లోక్ అదాలత్ శారద, గురుకుల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## 'పురం'లో సినిమా రాజకీయం

◆ 'వీరసింహారెడ్డి' చిత్రం చుట్టూ పొలిటికల్ ఫైట్
◆ శతదినోత్సవ వేడుకల నిర్వహణకు బాలయ్య అభిమానుల పట్టు
◆ అనుమతులు నిరాకరించిన మున్సిపల్ అధికారులు
◆ కార్యాలయం ముందు 3గంటల పాటు రాస్తారోకో

హిందూపురం మున్సిపల్ కార్యాలయం వద్ద రాస్తారోకో చేస్తున్న బాలకృష్ణ అభిమానులు, టిడిపి నాయకులు

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురంలో రాజకీయ కాక వేడిపుట్టిస్తోంది. ఈ సారి వివాదం వీరసింహారెడ్డి చిత్రం చుట్టూ తిరుగుతోంది. సినీ నటుడు, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకష్ణ నటించిన వీర సింహారెడ్డి సినిమా శతదినోత్సవ వేడుకలను శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో నిర్వహించడానికి టిడిపి నాయకులు, బాలయ్య అభిమానులు సిద్ధమయ్యారు. వేడుకలను నిర్వహించేందుకు పురపాలక సంఘ ఆధీనంలో ఉన్న ఎంజిఎం మైదానం ఇవ్వాలని బాలయ్య అభిమానులు ఈ నెల 17వ తేదీన పురపాలక సంఘం అధికారులను రాతపూర్వకంగా కోరారు. గత నాలుగు రోజులుగా అనుమతుల కోసం పురపాలక సంఘం కార్యాలయం చుట్టూ తిరిగారు. మున్సిపల్ అధికారులు అనుమతులను నిరాకరించారు. దీంతో ఆగ్రహించిన అభిమానులు, టిడిపి నాయకులు నిరసనకు సిద్ధం అయ్యారు. బుధవారం నాడు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అయినప్పటికీ అధికారులు అనుమతి ఇవ్వలేదు. దీంతో మరింత ఆగ్రహంతో మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న ప్రధాన రహదారిపై మండుటెండల్లో మూడు గంటలు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వం, ఎమ్మెల్సీ, ఛైర్‌పర్సన్, కమిషనర్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఓ వైపు నిరసనలు జరుగుతుండగానే టిడిపి ముఖ్య నాయకులు, పట్టణ సిఐలు ఈరన్న, వెంకటేశ్వర్లు సమక్షంలో మున్సిపల్ అధికారులతో రెండుసార్లు చర్చలు జరిపారు. అయినప్పటికీ ఇన్‌ఛార్జి కమిషనర్ ఆనంద్ కుమార్ అనుమతులు ఇవ్వడానికి సాధ్యం కాదని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ సెలవులో ఉన్నారని, ఇన్‌ఛార్జి కమిషనర్‌గా తాను అనుమతి ఇవ్వడానికి వీలు లేదంటూ వారికి తెలిపారు. దీంతో బాలయ్య అభిమానులు, టిడిపి నాయకులు అనుమతులు మంజూరు చేయాలంటూ రోడ్డుపై బైటాయించారు. మూడు గంటల పాటు రాస్తారోకో జరగడంతో ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వేడుకలు నిర్వహించేందుకు ఎంజీఎం మైదానం ఇవ్వడానికి సాధ్యం కాదని విషయాన్ని రాతపూర్వకంగా ఇవ్వాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంజిఎం హై స్కూల్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించడానికి అనుమతి లేదంటూ ఇన్‌ఛార్జి కమిషనర్ ఆనంద్ కుమార్ లిఖితపూర్వకంగా ఇచ్చారు. అనంతరం వారు ఆందోళన విరమించారు.

వేడుకలను నిర్వహించి తీరుతాం

**బాలయ్య అభిమానులు, టిడిపి నాయకులు**

బాలకృష్ణ నటించిన వీరసంహారెడ్డి సినిమా శతదినోత్సవ వేడుకలను హిందూపురంలో నిర్వహించి తీరుతామని టిడిపి నాయకులు, బాలయ్య అభిమానులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టిడిపి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, బాలకష్ణ అభిమానుల సంఘం జాతీయ కన్వీనర్ నంబూరి సతీష్ కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్, సీనియర్ నాయకులు నాగరాజులు విలేకరులతో మాట్లాడుతూ వైసిపి నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎంజీఎం మైదానం ఇచ్చేందుకు కావాలనే అభ్యంతరాలు సృష్టిస్తున్నారని చెప్పారు. ఒక వేళ ఆ ప్రాంతంలో అనుమతి ఇవ్వకున్నా శత దినోత్సవ వేడుకలను అనుకున్న సమయానికి హిందూపురంలోనే మరో ప్రాంతంలో కచ్చితంగా నిర్వహిస్తామని చెప్పారు. వేడుకల కోసం మైదానం ఇవ్వమని అంటున్న అధికారులు గత పది రోజుల క్రితం వైసీపీ ప్రభుత్వం ఆసరా కార్యక్రమం చేసినప్పుడు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. స్థానిక శాసన సభ్యులు బాలకష్ణ నిర్వహించే కార్యక్రమానికే మున్సిపల్ అధికారులు ఇలా చేస్తే సామాన్యులకు సుపరిపాలన ఎలా అందిస్తారన్నారు. మున్సిపల్ అధికారులు నిరాకరించిన లేఖ ద్వారా కోర్టుకు వెళుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలకష్ణ అభిమాన సంఘం నాయకులు హెచ్ఎన్.రాము, కౌన్సిలర్‌లు రాఘవేంద్ర, సతీష్ కుమార్, లీగల్ సెల్ కన్వీనర్ శివకుమార్, టిడిపి నాయకులు అమర్నాథ్, నజీర్, మోద శివకుమార్, చంద్రశేఖర్, రామాంజినమ్మ, పరిమళ, వెంకటేష్, బాలయ్య అభిమానులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

### డిఐజి అమ్మిరెడ్డి

పోలీసు అధికారులతో మాట్లాడుతున్న డిఐజి

**ప్రజాశక్తి ధర్మవరం టౌన్**

అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డీఐజీ ఆర్.ఎన్.అమ్మిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ధర్మవరం పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం రాత్రి తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, డీఎస్పీ హుసేన్ బాషా, సిఐలతో సమావేశం నిర్వహించారు. అనంతరం డిఐజి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మట్కా, గ్యాంబ్లింగ్, బెట్టింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా నియంత్రించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామన్నారు. లా అండ్ ఆర్డర్ కట్టుదిట్టంగా అమలు చేసేందుకు పోలీసు అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. వార్డులు, గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా నిరంతరం నిఘా ఏర్పాటు చేశామన్నారు. అందులో భాగంగా రెగ్యులర్ పోలీస్ తోపాటు మహిళా పోలీసులను ఉపయోగిస్తున్నామన్నారు.ఆయా వార్డు, గ్రామం, ప్రాంతానికి కేటాయించిన కానిస్టేబుల్ తోపాటు మహిళా పోలీసులు కోఆర్డినేషన్‌తో పనిచేస్తున్నారని తెలిపారు. తద్వారా క్రైం రేటు తగ్గించేందుకు ఎంతో దోహదపడుతోందని వివరించారు. కాఫీ విత్ మెన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని డీఐజీ తెలిపారు. పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించి వారితో మాట్లాడటం కాకుండా మధ్యలో టేబుల్స్ లేకుండా రౌండ్‌గా కుర్చీలు వేసుకుని కూర్చుని ఫ్రెండ్లీగా కాఫీ తాగుతూ వారితో లాస్ట్ వారం ఏమి చేశాం. రాబోయే వారంలో ఏమి చర్యలు తీసుకోవాలి, ఎక్కడెక్కడ ఏమి జరుగుతోందో వివరాలు సేకరించాల్సిన బాధ్య స్టేషన్ ఆఫీసర్లపై ఉంటుందన్నారు. సమావేశాలు నిర్వహించి సిబ్బందితో మాట్లాడితే పూర్తి సమాచారం సేకరించలేకపోతున్నామని కాఫీ విత్ మెన్ అనే కార్యక్రమంతో వారితో స్నేహభావంగా మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో పూర్తి సమాచారం తెలుసుకోవడానికి వీలు ఉంటుందన్నారు. పోలీసుఅధికారులు తమతో స్నేహంగా ఉంటారా అని వారిలో మానసిక ధైర్యం నింపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ సుబ్రమణ్యం, టూటౌన్ సిఐ రాజా, ట్రాఫిక్ సిఐ వహీద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక హోదా కోసం వికలాంగుడి పోరు

### ధర్మవరం చేరుకున్న మూడు చక్రాల సైకిల్‌యాత్ర

**ప్రజాశక్తి ధర్మవరం టౌన్**

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విశాఖపట్నంకు రైల్వేజోన్ కోసం మూడు చక్రాల సైకిల్ యాత్ర చేపట్టినట్టు వికలాంగుడు ప్రసాద్ తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం శ్రీకాకుళం జిల్లా కంచలి మండలం బురగా గ్రామానికి చెందిన తాను 2018లోనే ఇచ్ఛాపురం నుండి ఉమ్మడిజిల్లా అనంతపురానికి మూడు చక్రాల సైకిల్ యాత్రను ప్రారంభించానన్నారు. అయితే కరోనా కారణంగా 2020లో నంద్యాల వరకు యాత్ర నిర్వహించి నిలిపివేశానన్నారు. ఆతరువాత తిరిగి ఈఏడాది జనవరి మొదటి వారం నుండి సైకిల్ యాత్రను ప్రారంభించినట్లు చెప్పారు. 23 జిల్లాలోనూ ఈ సైకిల్ యాత్ర నిర్వహించి ఢిల్లీకి వెళ్తానన్నారు. తాను నిర్వహించిన ఈ యాత్రలో జిల్లాలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని ఢిల్లీ పెద్దల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ప్రతి నియోజకవర్గంలో రెవిన్యూ, పోలీసులు తనకు సహకరిస్తున్నారని ఆయన తెలిపారు. గురువారం రాత్రి ధర్మవరానికి చేరుకున్నానని, తిరిగి శుక్రవారం ఉదయం బయలుదేరి లేపాక్షి వరకు ఈ యాత్రను కొనసాగిస్తానని ప్రసాద్ తెలిపారు.

మూడు చక్రాల సైకిల్ యాత్రలో వికలాంగుడు ప్రసాద్

## సచివాలయ ఉద్యోగుల విరాళం

**ప్రజాశక్తి - బత్తలపల్లి**

జిల్లాలోని పేద ప్రజలకు ఆర్డీటీ అందిస్తున్న సేవలకు తమ వంతు సాయంగా గ్రామ సచివాలయ ఉద్యోగులు విరాళం అందించారు. గురువారం స్థానిక బత్తలపల్లి-2 సచివాలయంలోని ఉద్యోగులు, పోట్లమర్రి సర్పంచి అక్కిం దామోదర్ తమ వంతు సాయంగా విరాళం అందించారు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ నరేంద్రరెడ్డి, మహిళా కానిస్టేబుల్ జీవిత, ఇంజనీర్ అసిస్టెంట్ కార్తీక్ తేజస్విణి, వేల్ఫేర్ అసిస్టెంట్ పవన్ కుమార్ రెడ్డి రూ.3వేలు, సర్పంచి చు అక్కిం దామోదర్ రూ.2వేలు చొప్పున ఆర్డీటీ సీవో వెంకటేష్ కు అందించారు. స్పందించు సాయం అందించు కార్యక్రమం కింద అనాథ పిల్లల సహాయార్థం వీటిని వెచ్చించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీబీటీ కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

## మూడు చక్రాల స్కూటర్లు మంజూరు

**ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్**

: జిల్లాలో శారీరక వికలాంగులకు మూడు చక్రాల స్కూటర్లు మంజూరు అయ్యాయని జిల్లా వికలాంగుల, వయోవృద్ధుల సహాయ సంస్థ సహాయ సంచాలకులు అబ్దుల్ రసూల్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంజూరు అయిన పేర్లు ను వెబ్ సైట్ లో పొందుపరిచామన్నారు. ఎంపికైన వారు అందులో చూసుకోవచ్చన్నారు. ఇతర సమాచారం కొరకు 9866782326 కు సంప్రదించాలని కోరారు.

**బాగేపల్లి న్యూస్....**

## గుడిబండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తా

**ప్రజాశక్తి - చిలమత్తూరు(బాగేపల్లి నుంచి)**

గుడిబండ తాలుక కేంద్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని సిపిఐ(ఎం) అభ్యర్థి డాక్టర్ అనీల్ కుమార్ అన్నారు. ఈ మేరకు సిపిఐ(ఎం) ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం గుడిబండ 7,8,9 వార్డులలో ప్రచారం జోరుగా సాగింది. ఈ సందర్భంగా సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనీల్ కుమార్ మాట్లాడుతూ గుడిబండ ప్రాంతానికి పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అన్ని అవకాశాలు ఉన్నప్పటికి గత ఎమ్మెల్యేలు ఏ మాత్రం పట్టించుకోలేదని అన్నారు. అయితే సిపిఎం ఎమ్మెల్యే గా శ్రీరామిరెడ్డి ఉన్నప్పుడు గుడిబండను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారని అన్నారు. తర్వాత ఎన్నికలో ఓటమి పాలవడంతో ఆ కల నెరవేరలేదని అయితే తాను ఎన్నికల్లో గెలిచిన వెంటనే గుడిబండ కోటను సరికొత్త హంగులతో అభివృద్ధి చేస్తానని చెప్పారు. అంతేకాకుండా చెరువులో బోటింగ్ వంటి వ్యవస్థతో పాటు వాటర్ పాల్స్ వంటివి ఏర్పాటు చేసి పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమం లో రైతు సంఘం నాయకులు,స్థానిక యువకులు, జెడిఎస్, సిపిఎం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్

చీరలు పంపిణీచేస్తున్న టీడీపీ రాష్ట్రకార్యదర్శి గోనుగుంట్ల విజయ్‌కుమార్

## ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ

**ధర్మవరం టౌన్ :** ధర్మవరం పట్టణంలోని 40 వార్డులలోని ముస్లిం మహిళలకు టీడీపీ నాయకులు గురువారం చీరలను పంపిణీచేశారు. 10వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జి క్రిష్టాపురం జమీర్‌అహమ్మద్ ఆధ్వర్యంలో రంజాన్ పండుగ సందర్భంగా 10వ వార్డులలోని 1100 మంది ముస్లిం మహిళలకు చీరలను టీడీపీ రాష్ట్రకార్యదర్శులు గోనుగుంట్ల విజయ్ కుమార్, కమతం కాటమయ్య, నాయకులు ఫణికుమార్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగూరుహుస్సేన్, పరిశేసుధాకర్, అంబటిసనత్, పఠాన్ బాబుబావ్, దేవరకొండ రామకృష్ణ, అత్తర్ రహీంబాషా, గంగారపు రవి, బొట్టు కిష్ట, ఓంకార్, కొత్తపేట ఆది, టైలర్ కుల్లాయప్ప, ఇర్షాద్, ఉస్మాన్, చికెన్ రాము తదితరులు పాల్గొన్నారు.

## మరమ్మతుకు నోచని చేతిపంపులు

**నంబులపూలకుంట :** మండలంలోని పలు చేతిపంపులు మరమ్మతుకు గురైనా వాటిని పట్టించుకునే వారు లేరని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. దీంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కేంద్రం జడ్పీ హైస్కూల్ వద్ద, మండల పరిధిలోని గోకనపల్లి సచివాలయం వద్ద, ఎదురుదొనపంచాయతీ హెల్త్ సబ్ సెంటర్ వద్ద ఇలా పలు ప్రాంతాల్లో ఉన్న చేతిపంపులు పనిచేయడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ చేతిపంపులను మరమ్మతులు చేసి ఈ వేసవిలో తాగునీటి సమస్యను కొద్దివరకైనా నివారించాలని కోరుతున్నారు.

## పేకాటస్థావరంపై దాడులు

**రొద్దం :** మండలంలోని సానిపల్లి గ్రామ సమీపంలో గల కంప చెట్లలో ఏర్పాటు చేసిన పేకాట స్థావరంపై పెనుకొండ సి ఐ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. పెనుగొండ మండలం మావటూరు గ్రామానికి చెందిన రవి, నాగప్ప లతో పాటు మొత్తం 13 మంది పేకాట జూదరులను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ నాగస్వామి తెలిపారు. వారి వద్ద నుండి రూ.14,860ల నగదు, 5 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

## మూతబడిన శుద్ధజల కేంద్రం

**రొద్దం :** మండల కేంద్రంలోని పెనుగొండ పావుగడ ప్రధాన రహదారిలో పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న శుద్ధ జల కేంద్రం రెండు నెలలుగా మూతపడింది. దీంతో దాదాపు వందల కుటుంబాలు తాగునీటికి తంటాలు పడుతున్నాయి. గత టిడిపి ప్రభుత్వంలో మండల కేంద్రంలో ఆర్డీటీ సౌజన్యంతో సచివాలయం 1 కేంద్రం వద్ద శుద్ధ జల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఇది రెండు నెలలుగా మూతపడింది. ఈ కేంద్రంలో పని చేసే వ్యక్తికి కనీసం దిన కూలి కూడా రాకపోవడంతో మూత పడిపోయింది. అధికారులు స్పందించి ఈ కేంద్రం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## గర్భిణులు వైద్యపరీక్షలు చేయించుకోవాలి

**రొద్దం :** గర్భిణులు, బాలింతలు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని డిఎంహెచ్ఒ ఎస్‌వి. కృష్ణారెడ్డి సూచించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కలిపి గ్రామ సచివాలయంలో డాక్టర్ జగదీష్ బాబు ఆధ్వర్యంలో గురువారం బాలింతలు, గర్భిణులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్‌వి కృష్ణారెడ్డి, డిపిఎంఒ కుళ్లాయప్ప నాయక్, డాక్టర్ రమ్య, సిడిపిఒ అనురాధ, సిహెచ్ఒ వన్నప్ప తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ప్రతినెల గర్భిణులు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలనానరు. రక్తహీనత గల వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐరన్ సుక్రోజ్ సూది మందు ఎక్కించడం ద్వారా మేలు జరుగుతుందన్నారు. అంగన్వాడీ సెంటర్‌లో లభించే పౌష్టిక విలువలు గల ఆహారాన్ని భుజించాలని కోరారు.

## 24న మోడల్ ఎంసెట్ : ఎస్ఎఫ్ఐ

**హిందూపురం :** ఈనెల 24న పట్టణంలోని సప్తగిరి కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి బాబావలి తెలిపారు. గురువారం పట్టణంలోని కళాశాల వసతి గృహం వద్ద మోడల్ ఎంసెట్ గురించి వివరించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, ప్రధాన పట్టణాల్లో మోడల్ ఎంసెట్ నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే హిందూపురం పట్టణంలో కూడా ఈనెల 24వ తేదీన సప్తగిరి కళాశాల పరీక్ష కేంద్రంగా మోడల్ పరీక్షను నిర్వహిస్తున్నాము. ఎంసెట్ తో పాటు వివిధ పోటీ పరీక్షలకు పాల్గొనే విద్యార్థుల్లో అవగాహన పెంచడానికి కోసం మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఎంసెట్ పరీక్ష రాసే ప్రతి విద్యార్థి కూడా ఈ మోడల్ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మోడల్ ఎంసెట్ పరీక్ష రాసే విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకొనుటకు సెల్ నెంబర్ 9885600478 కి సంప్రదించాలన కోరారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, నిహాల్, తదితరులు పాల్గొన్నారు.

## చేనేత రాయలసీమ జోనల్ ప్రధాన కార్యదర్శిగా గంగరాజు

**తలుపుల :** జాతీయ చేనేత ఐక్యవేదిక రాయలసీమ ప్రధాన కార్యదర్శిగా గంగరాజును ఆసంఘం రాష్ట్ర అధ్యక్షులు సుంకర చిన్న రెడ్డి బాబు నియమించారు. ఈసందర్భంగా గంగరాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో జాతీయ చేనేత ఐక్యవేదిక కమిటీలో అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తానని చెప్పారు. ఈకార్యక్రమంలో చేనేత కార్మికులు చౌడయ్య, కొండయ్య, విశ్వనాథ్, రామాంజనేయులు, లోకేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ తోఫా పంపిణీ

**పెనుకొండ :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో గురువారం ముస్లిం సోదరులకు రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల సందర్భంగా పట్టణంలోని వజ్రాల పేటలో సవితమ్మ స్వగృహం వద్ద కేక్ కట్ చేశారు. అనంతరం నిరుపేదలైన 1500 ముస్లిం కుటుంబాలకు 10 రకాలతో కూడిన రంజాన్ తోపాను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు,కార్యకర్తలు, ముస్లిం సోదరులు, మహిళలు పాల్గొన్నారు.

## చలో రాజమండ్రిని విజయవంతం చేయండి

**పుట్టపర్తి రూరల్:** ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన రాజకీయ హామీల అమలుకు ఉద్యోగుల బకాయిల చెల్లింపులు చట్టం కోసం రాజమండ్రిలో 30న నిర్వహిస్తున్న రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజిఇఏ) రాష్ట్ర కార్యదర్శి బాబా సాహెబ్ కోరారు. ఈవిషయంపై ఉద్యోగస్తులను చైతన్యవంతం చేయుటకు గురువారం పుట్టపర్తి వచ్చిన ఆయన స్థానిక ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు తమ భవిష్యత్ అవసరాల కోసం వేతనాల నుంచి దాచుకున్న సుమారు రూ. 13 వేల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకుందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ అవసరాల కోసం నెలనెలా జీతాల నుంచి దాచుకుంటున్న జీపీఎఫ్ పై స్పష్టత లేకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. ఉద్యోగుల సమస్యలపై చిత్తశుద్ధితో పోరాటం చేస్తామని ఉద్యోగుల్లో ఉన్న పేరుకు తగ్గట్టుగా ఆందోళన కార్యాచరణ ప్రకటిస్తామని దీనిని విజయవంతం చేసే బాధ్యత ఉద్యోగులదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు విబి భాస్కర్ రెడ్డి, కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, కోశాధికారి నారాయణ రెడ్డి, నిర్వాహక కార్యదర్శి రామచంద్రా రెడ్డి, రమేష్ బాబుతో పాటు అన్ని తాలూకా అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# గడువులోగా భూముల రీ సర్వే పూర్తి

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, తదితరులు

### కలెక్టర్ అరుణ్ బాబు

**ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్**

నిర్ణీత గడువులోగా మొదటి దశ రీ సర్వే పూర్తి చేస్తామని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. రీ సర్వే ప్రక్రియ, గృహ నిర్మాణాల పురోగతి, జాతీయ రహదారులకు భూ సేకరణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం సమీక్షించారు. రీ సర్వే, జాతీయ రహదారులకు భూ సేకరణ, గృహ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జవహర్ రెడ్డి ఆదేశించారు. పర్యాటక శాఖ కు చెందిన భూమి అలియనేషన్ త్వరగతిన పూర్తి చేయాలని వ్యవసాయ అనుబంధ శాఖలు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖలు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. జగనన్న భూ హక్కు భూ రక్ష రీసర్వే సకాలంలో పూర్తి చేయాలన్నారు. మొదటి దశలో రీ సర్వే ప్రక్రియ పూర్తి అయిన వాటికి రాళ్ల నాటే కార్యక్రమం వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ నెలలోపు ఈ పనులు పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణం పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, జాతీయ రహదారులకు భూ సేకరణ త్వరగతిన పూర్తి చేయాలన అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, డిఆర్ఒకొండయ్య, గృహ నిర్మాణ శాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి, సిపిఒ విజయ్ కుమార్, ల్యాండ్స్ రికార్డ్స్ ఎడి రామకృష్ణ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, పిఆర్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, వ్యవసాయ అధికారి సుబ్బారావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలల్లోనే చేర్పించండి

**ప్రజాశక్తి ధర్మవరం టౌన్**

కార్పొరేట్ కళాశాలలో రంగులను, వారి మాటలను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి కోరారు. ఈ మేరకు ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు గురువారం కళాశాల ఆవరణంలో 'ఆలోచించండి వాస్తవాలను తెలుసుకోండి.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చేరండి.. చేర్పించండి' అన్న నినాదాలతో కూడిన గోడపత్రికలను విడుదలచేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం తదితర వాటిని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**ప్రజాశక్తి - గోరంట్ల**

పార్టీలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందివ్వడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంకర్‌నారాయణ తెలిపారు. మండలంలోని రెడ్డి చెరువు పల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీ నరసప్ప, సర్పంచి వినోద్, ఎంపీపీ ప్రమీల మూర్తి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ శంకర్ రెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు రఘురాం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో రఘునాథ్ గుప్తా, తహశీల్దార్ రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొలతల ప్రకారం పని చేస్తే గిట్టుబాటు కూలి

**ప్రజాశక్తి - బత్తలపల్లి**

ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేసుకుంటే ప్రతి కూలీకి రూ.272లు కూలి వస్తుందని ఎంపీడీవో శ్రీదేవి అన్నారు. గురువారం మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో జరుగుతున్న అమత్ 'సరోవర్' ఉపాధి పనులను ఆమె ఏపీవో కుందానం ఆదెప్పతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి కూలీలకు వేసవి అలవెన్సు ప్రకటించిందని వివరించారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి పనులను జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేఈ నాగార్జున, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ ప్రభుత్వంలో ప్రజలకు కష్టాలు

**రొద్దం :** జగన్నన్న ప్రభుత్వంలో ప్రజలు తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు విమర్శించారు. మండలంలోని క్లస్టర్ 1లో ఇదేమి ఖర్మ మనరాష్ట్రానికి అనే కార్యక్రమం ఎం. కొత్తపల్లి గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రొద్దం క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగేంద్ర, నాయకులు నాగరాజు, వీరన్న పెద్ద వీరన్న, చిన్న సుబ్బారాయుడు, అంజినప్ప, నాగన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందు

**కదిరి అర్బన్ :** పట్టణ పరిధిలోని ఖాజా సుబహానియా మసీద్‌లో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో శాసనసభ్యులు డాక్టర్ పి వి సిద్ధారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మైనార్టీ సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు పంక్తి భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్, న్యాయవాది ఎస్ఎండి ఫైజుల్లా, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ

**హిందూపురం :** పవిత్ర రంజాన్ పురస్కరించుకొని పురపాలక సంఘంలోని 23, 25 వార్డులో కౌన్సిలర్ అయుబ్ ఖాన్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ చేతుల మీదుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉన్నదానిలో కొంతమేర దానధర్మాలు చేయాలన్నారు. అనంతరం వార్డులలో కుల మతాలు అతీతంగా 500 కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ రహమత్, వైసిపి నాయకులు శివశంకర్ రెడ్డి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## కంటి వైద్యశిబిరం

**చిలమత్తూరు :** మండల కేంద్రంలోని శ్రీ సాయియేసు విద్యానికేతన్,మిథున్ టెక్నాలజీ వారి సౌజన్యంతో పాఠశాల ఆవరణంలో శంకర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆరుగురు వైద్యులు ఈ శిబిరంలో 192 మందికి పరీక్షలు నిర్వహించారు. తీవ్ర కంటి సమస్యతో బాధపడే 109 మందిని ఆపరేషన్ కొరకు రెఫర్ చేశారు. ఆపరేషన్ కొరకు రెపర్ చేయబడ్డ 109 మందికి బెంగుళూరులోని శంకర్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయించనట్లు నిర్వాహకులు బాస్కర్ రెడ్డి, నరసింహారెడ్డి, బాలాజీ రెడ్డి తెలిపారు.

## అంకితభావంతో పనిచేయండి

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

అంకితభావంతో పనిచేయాలని హోంగార్డుల కమాండెంట్ మహేష్ కుమార్ హోంగార్డులకు సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం కదిరి పట్టణంలో హోంగార్డులతో మార్చు ఏర్పాటు చేశారు. హోంగార్డుల ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా విధి నిర్వహణ సమయంలో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమలో హోంగార్డుల జిల్లా అధికారి శ్రీశైలం రెడ్డి, శ్రీరాములు, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీకి మైరాడ భవనం అప్పగింత

**అగళి :** మండలంలోని ఇరిగేపల్లి పంచాయతీలో 1997లో నిర్మించబడిన మైరాడ కార్యాలయాన్ని పంచాయతీకి అప్పగించారు. ఇరిగేపల్లి పంచాయతీలో అప్పటి డైరెక్టర్ ఫెర్రెండేస్ సుమారు 70 సెంట్లు భూమిని అగళి బసవే గౌడ్ మైరాడ సంస్థ కు దానంగా ఇచ్చారు. ఆ 70 సెంట్లు భూమిలో సుమారు రెండు కోట్ల రూపాయల విలువ చేసే భవనాలు నిర్మించారు. మైరాడ సంస్థ మరోచోటుకు మార్చడంతో ఇక్కడున్న భవనం మూడేళ్లుగా మూత పడింది. ఖాళీగా ఉన్న ఈ భవనం అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. మాజీ మంత్రి రఘువీరారెడ్డి మైరాడ ప్లాన్ సంస్థ సంస్థాపకులు ఫెర్నాండిస్ తో మాట్లాడి ఖాళీగా ఉన్న భవనాన్ని పంచాయతీకి ఉపయోగకరంగా ఉంటుందని ఆ భవనాన్ని పంచాయతీకి అప్పగించాలని సూచించారు. దీంతో గురువారం మైరాడ సంస్థాపకుడు ఆధ్వర్యంలోనే పంచాయతీ సర్పంచ్ లక్ష్మమ్మకు ఈ భవనాన్ని అప్పగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లక్ష్మమ్మ, మాజీ మంత్రి రఘువీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు సూచించారు. జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు గురువారం కదిరి ఆర్డీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్డీఓ కార్యాలయానికి వచ్చే ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ సమస్యలకు పరిష్కారం చూపించాలని అన్నారు. కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్పందన గ్రీవెన్స్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించి డివిజన్ కు మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాఘవేంద్ర, తహశీల్దార్ నటరాజు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ సంస్థలకు అండగా మోడీ ప్రభుత్వం

**ప్రజాశక్తి - తనకల్లు**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అండగా నిలిచిందని రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటమయ్య విమర్శించారు. మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ లో ప్రజా వ్యతిరేక ,నిరంకుశ, మతోన్మాద బిజెపి విధానాలపై ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాటమయ్య మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపాలని, దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహం అంతా ఇంత కాదన్నారు. ఏపీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరానికి నిధులు, రాజధాని నిర్మాణం, రైల్వే జోన్, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇలాంటి హామీలు ఇచ్చిని వాటిని అమలు చేసిన పాపాన పోలేదన్నారు. ఏపీకి ఆయుపట్టు లాంటి విశాఖ ఉక్కును కార్పొరేట్ రాబందులకు కట్టబెట్టడానికి కేంద్రం కుట్ర పన్నుతోందన్నారు. నరేంద్ర మోడీ ఏపీకి చేస్తున్న ద్రోహాన్ని వైసిపి నిలదీయలేకపోతోందన్నారు. బిజెపి వైసిపి పాలనకు భిన్నంగా కేరళలో వామపక్ష ప్రభుత్వం ఆదర్శవంతంగా నడుపుతోందన్నారు. కేరళ ప్రభుత్వాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమం లో ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షా కార్యదర్శులు హనుమంతరెడ్డి, జేవీ రమణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజేంద్రప్రసాద్, డివిజన్ కార్యదర్శి కదిరప్ప, సహాయ కార్యదర్శి రాజేష్ మండల కార్యదర్శి రెడ్డెప్ప, సీపీఎం మండల కార్యదర్శి శివన్న తదితరులు పాల్గొన్నారు.

**బత్తలపల్లి :** ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సిపిఐ నాయకులు ప్రజలను కోరారు. గురువారం మండలం పరిధిలోని సంజీవపురం, ముష్టూరు, రాఘవంపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాలలోని రైతులను రైతు కూలీలను ప్రజలను కలిసి కేంద్ర ప్రభుత్వ విధి విధానాలను వారికి వివరించారు. రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కుల్లాయప్ప,

ర్యాలీలో పాల్గొన్న నాయకులు

మండల కార్యదర్శి బండలు వెంకటేష్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలైన ఆదాని అంబానీలకు కేంద్రం పెద్దదిక్కుగా ఉందన్నారు. వేల కోట్ల రూపాయలకే ఎగనామం పెట్టిన పెద్దలను వదిలిపెట్టి క్షేత్రస్థాయిలో నిరంతర ఇబ్బంది పడుతున్న పేదల కడుపు కొడుతున్న కేంద్ర ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఎఫ్ఐ పోతలయ్య, సిపిఐ మండల సహాయ కార్యదర్శి గుండా ఒబిలేష్, పట్టణ కార్యదర్శి రవి సత్యనారాయణ తదిరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు 1వ తేదీనే వేతనాలు ఇవ్వాలి

**ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్**

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెల 1వ తేదీనే వేతనాలు ఇవ్వాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ వైనుద్దీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలస్యంగా వేతనాలు ఇవ్వడం వల్ల ప్రతి నెల బ్యాంకులలో తీసుకున్న ఈఎంఐలు సకాలంలో చెల్లించలేకపోతున్నామన్నారు. ఫలితంగా వడ్డీల భారంతో అల్లాడిపోతున్నామన్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకపోయిందన్నారు. వివిధ దశల్లో జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తున్నామన్నారు. బ్యాంకర్లు అయినా తమ పరిస్థితులు అర్థం చేసుకోవాలని పుట్టపర్తి ఎస్ బి ఐ మేనేజర్ రాంప్రసాద్‌కు తనతో పాటు మున్సిపల్ ఉద్యోగుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు, ఆర్టీసీ ఉద్యోగుల జిల్లా కార్యదర్శి రమణ, ఎంప్లాయిస్ కార్యదర్శి ప్రసాద్, తదితరులు కలసి వినతి పత్రం సమర్పించామన్నారు.

# పన్నుల వసూళ్లలో ధర్మవరం టాప్

**ప్రజాశక్తి ధర్మవరం టౌన్**

2022-23 ఆర్థిక సంవత్సరపు మున్సిపల్ పన్నుల వసూళ్లలో ధర్మవరం మున్సిపాలిటీ శ్రీ సత్యసాయి జిల్లాలో మొదటి స్థానం, అనంతపురం జిల్లాతో పోలిస్తే రెండవ స్థానంలో ఉందని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు, 31-3- 2023 నాటికి ప్రైవేట్ ఆస్తి పన్నులు రూ. 8.81 కోట్లు ఉండగా, అందులో రూ. 8 కోట్లు వసూలు చేసినట్లు చెప్పారు. ఇందుకుగాను 90.69 శాతము నమోదు కావడం జరిగిందని, చరిత్రలో ఇది ఎప్పుడు జరగలేదని తెలిపారు. ఇటీవలే ప్రభుత్వం వడ్డీ మాఫీ చేయడం, పట్టణములోని సచివాలయ వ్యవస్థలో అడ్మిన్ కార్యదర్శుల సహకారం, వార్డు కౌన్సిలర్ల ప్రోత్సాహ సహకారం, మున్సిపల్ రెవెన్యూ విభాగంలో ఆర్ఐ అధికారితోపాటు సిబ్బంది కృషితో ఇది సాధ్యమైందని అన్నారు. అదేవిధంగా పెండింగ్ లో ఉన్న అన్ని పన్నులను త్వరితగతిన కట్టాలని ప్రజలకు కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# నేరాలు ఘోరాలు

## హత్య కేసులో నిందితులు అరెస్టు

**హిందూపురం :** హిందూపురం రూరల్ మండలం చలివెందుల గ్రామంలో గత సంవత్సరం జరిగిన షేక్ బాబ్జాన్ (45) హత్య కేసులో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ అప్ గ్రేడ్ స్టేషన్ సిఐ క్రిష్ణారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసుకు సంబందించిన వివరాలు వెల్లడించారు. చలివెందల గ్రామానికి చెందిన షేక్ బాబ్జాన్ (45) జనవరి 26వ తేదీ సాయంత్రం ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదని అతని భార్య షేక్ రజియా ఫిర్యాదు చేసింది. పోలీసులు దీనిని మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. అయితే బాబ్జాన్ తన పొలానికి నీళ్లు పెట్టి ఇంటికి తిరిగి వస్తుండగా దారిలో చలివెందుల చెందిన ముర్తప్ప అనే వ్యక్తి పొలంలో అడవి పందుల కోసం వేసిన కరెంటు తీగలకు తగిలి మృతిచెందాడు. ఆ సమయంలో పందులు ఏమైనా పడినాయేమో అని అక్కడికి వెళ్లిన చాకలి క్రిష్టప్ప, క్రిష్టప్ప, గొల్ల శ్రీరాములు అనే ముగ్గురు మృతదేహాన్ని చూసి తమ మీదకు నేరం వస్తుందేమో అని ఎవరికీ చెప్పకుండా వారి గ్రామానికే చెందిన నరేష్ అనే వ్యక్తితో ఆటో తెప్పించుకొని గ్రామ సమీపంలో ఉన్న హంద్రీనీవా కాలువలో శవాన్ని పూడ్చి వేశారు. ఈ విషయం నిందితుల్లో ఒకరైన శ్రీరాములు మద్యం తాగి గ్రామంలో చెప్పడంతో బయటకు వచ్చింది. వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ మేరకు మృతదేహాన్ని పూడ్చిన స్థలంలోకి గురువారం వెళ్లి, మృతదేహాన్ని బయటకు తీసి తహశీల్దార్ రామాంజన రెడ్డి సమక్షంలో పోస్టు మార్టం నిర్వహించారు. అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన కరెంట్ వైరు తగిలి షాక్ కొట్టి మృతిచెందగా నిందితులు అతని మృతదేహాన్ని ఎవరికీ కనపడకుండా పూడ్చి సాక్ష్యాలను మార్చిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు.

మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

## చెట్టుపై నుంచి కింద పడి యువకుడికి గాయాలు

**బత్తలపల్లి :** మండలంలోని పోట్లమర్రి గ్రామంలో తాటికాయల కోసం చెట్టు ఎక్కిన వ్యక్తి తప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన ఈడుగ కాంతప్ప కుమారుడు ఈడుగ తరుణ్ కుమార్ బుధవారం తమ వ్యవసాయ బావి వద్ద తాటికాయల కోసం తాటి చెట్టు ఎక్కాడు. ఈసందర్భంగా పట్టు తప్పి పైనుండి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తరుణ్‌కుమార్‌కు చెయ్యి రెండు చోట్ల, కాలు విరిగింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

## మద్యం బాటిళ్లు ధ్వంసం

**ధర్మవరం టౌన్ :** వివిధ కేసుల్లో పట్టుబడిన కర్నాటక, ఆంధ్రామద్యాన్ని టూటౌన్, సెబ్ పోలీసులు గురువారం ధ్వంసం చేశారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన 13 కేసుల కర్నాటక, ఆంధ్రా మద్యాన్ని ధ్వంసం చేసినట్లు టూటౌన్ సిఐ రాజ, సెబ్ సిఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు.

## షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

**లేపాక్షి :** స్థానిక నంది విగ్రహం వెనుకాల గురువారం చిలమత్తూరు వైపు వెలుతున్న కారు లో ఒక్కసారి మంట లు చెలరేగడం తో కారు పూర్తిగా కాలిపోయింది. షార్ట్ సూర్క్యూట్‌తో కారు ఇంజన్ లో మంటలు రావడంతో కారు ను, ఓనర్ సోమశేఖర్ ప్రక్కకు పెట్టి మంటలు అర్పడానికి ప్రయత్నం చేసిన ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకొన్న ఎస్ ఐ మునీర్ అహమ్మద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

**గోరంట్ల :** స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఎత్తుకెళ్లిన ద్విచక్ర వాహనాల దొంగను మండలంలో గుమ్మయగారిపల్లి క్రాస్ లో అరెస్టు చేసినట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నిందితుడు నరేంద్ర కర్ణాటకలోని గంగావతి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు నిందితుడు నరేంద్ర ఏడు ద్విచక్ర వాహనాలు దొంగలించారన్నారు నిందితుడి నుండి ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు కోర్టుకు రిమాండ్ పంపినట్లు సిఐ సుబ్బారెడ్డి తెలిపారు

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**నల్లచెరువు :** మండల పరిధిలోని మోడల్ పాఠశాల వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల పరిధిలోని బొమ్మిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన దొడ్డప్ప (60) మృతిచెందాడు. దొడప్ప తన ద్విచక్ర వాహనంలో వ్యక్తిగత పనిమీద తనకల్లుకు వస్తుండగా మోడల్ స్కూల్ వద్ద వెనుక వైపు నుండి వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొని కొంతదూరం లాక్కెళ్ళింది. ఈ ప్రమాదంలో దొడ్డప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వరలక్ష్మి తెలిపారు.

**మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే :** నల్లచెరువు మండల పరిధిలోని ప్రభుత్వ మోడల్ స్కూల్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైసిపి వార్డ్ మెంబర్ జి.దొడ్డప్ప కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే పివి. సిద్ధారెడ్డి పరామర్శించారు. స్థానిక కదిరి ఏరియా ఆసుపత్రికి వెళ్లి దొడ్డప్ప మృతదేహానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తక్షణ సాయంగా రూ. 50 వేల రూపాయలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జూదరులు అరెస్టు

**లేపాక్షి :** మండలం పరిధిలోని నాయనిపల్లి గ్రామంలో గురువారం బెట్టింగ్ ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు. వారి వద్ద నుండి 71,500 రూపాయల నగదు, 5 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

## పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలి

**ప్రజాశక్తి-కనగానపల్లి**

మండల పోలీస్ స్టేషన్‌ను సత్యసాయి జిల్లా ఎస్‌పి మాధవరెడ్డి గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈసందర్భంగా మండలంలో చేపడుతున్న సామాజిక పోలీసింగ్‌పై స్థానిక ఎస్ఐ హనుమంతరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్లో ఉన్న పెండింగ్ కేసులు వివరాలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విదంగా సమస్యాత్మక గ్రామాల్లో నిత్తం పోలీస్ పర్యవేక్షణ ఉండాలని సూచించారు. మండలంలో చట్టవ్యతిరేక కార్యక్రమాలపై కఠినంగా వ్యవహరించాలని సిబ్బందికి ఆదేశించారు. స్టేషన్ సిబ్బంది సంక్షేమ కోసం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సిఐ చిన్నగౌస్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## అవినీతి యానిమేటర్‌పై చర్యలకు డిమాండ్

**గుడిబండ :** మండల పరిధిలోని పీసీ గిరి గ్రామానికి చెందిన సురేష్ అనే ఆనిమేటర్ సంఘ సభ్యులకు తెలియకుండా దాదాపు రూ. 13 లక్షల వరకు సంఘం డబ్బులు డ్రా చేసి పరారీలో ఉన్నాడని అతినిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధిత మహిళలు కోరారు. ఈ మేరకు పిసిగిరి గ్రామం లోని వివిధ సంఘాలకు చెందిన మహిళా సంఘ సభ్యులు గురువారం గుడిబండ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఎస్ఐ మునిప్రతాప్ విన్నవించారు. నిందితుడిపై చర్యలు తీసుకొని న్యాయం చేస్తామని ఎస్ఐ హామీ ఇచ్చారని మహిళలు తెలిపారు.

**In the Court of the Senior Civil Judge: Penukonda**

**E.P.No.5/2020 in O.S.No.85/2015**

**Between:**

Mandodla Rama Krishna Rao ...Decre Holder

And

Ajay G.Ankam ...Judgment Debtor

**NOTICE TO J.Dr**

Ajay G.Ankam, age 53 years, S/o Late G.B. Ankam, Hindu, Business, Residing at Hotel Sai Heritage, Gopuram Road, Puttaparthi, Sri Satya SAi District.

యిందు మూలకముగా నీకు తెలియచేయటం ఏమనగా పై నంబరు ఇ.పి.లోని షెడ్యూలు దాఖలా ఆస్తిలో వేలము వేసి డిక్రీ మొత్తము రాబట్టుకొనుటకు గాను అర్జీదారుడు అర్జీని దాకలు చేసినాడు. సదరు విషయములై నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల నీవు పై కోర్టులో 24-04-2023 వ తేదిన ఉదయం 10.30 గం॥లకు ఖుద్దున గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై నీ వాదనను కోర్టువారికి తెలుపకొనవలెను. లేనియెడల నీ పరోక్షమందు పై అర్జీని తీర్మానం చేయునని యిందుమూలకముగా నీకు తెలియచేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

**L.Viswanath, Advocate**
**Penukonda**